@netifocusnews @focustv
http://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | హైదరాబాద్ | శనివారం 17, ఆగస్ట్ 2024 | పేజీలు: 04

## ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీఖాన్

# ప్రమాణం..





- ప్రమాణం చేయించిన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 16:

తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొ.కోదండరామ్, అమీర్ అలీఖాన్‌లు శాసనమండలిలో అడుగుపెట్టారు. ఈ మేరకు ఇద్దరితో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణం చేయించారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమీర్ అలీఖన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారికి మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ సి.మహేష్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన తర్వాత కోదండరామ్ మాట్లాడారు. తాను ఎమ్మెల్సీగా నియామకం కావడంతో ఉద్యమకారులు సంతోషంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్ మిగతా 2లో..



# బీజేపీలో బీఆర్ఎస్ విలీనం!

## కేసీఆర్‌కు గవర్నర్, కేటీఆర్‌కు కేంద్రమంత్రి పదవి ఇస్తారు

- హరీశ్‌రావు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు అవుతారు
- కవితకు బెయిల్.. రాజ్యసభ ఎంపీ పదవి
- ఎస్సీ వర్గీకరణపై మోదీ సర్కారుకు విధానమన్నదే లేదు
- మా కుటుంబ సభ్యులకు ఎక్కడా, ఏ పదవీ ఇవ్వలేదు
- నేను సీఎం అయితే వారు దందాలు చేయొద్దా?: రేవంత్
- ఖర్గేతో భేటీ.. పీసీసీ చీఫ్, నామినేటెడ్ పదవులపై చర్చ
- క్యాబినెట్ విస్తరణ మీడియా సృష్టేనన్న ముఖ్యమంత్రి
- ఫోర్త్ సిటీలో ఫాక్స్‌కాన్!.. సీఎంతో కంపెనీ చైర్మన్ భేటీ
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 16:

బీఆర్ఎస్ పార్టీ.. బీజేపీలో విలీనం అయ్యే అవకాశముందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బేరసారాలు వివిధ స్థాయుల్లో జరుగుతున్నాయని, కేసీఆర్‌కు గవర్నర్ పదవి, కేటీఆర్‌కు కేంద్ర మంత్రి పదవి ఇస్తారని, హరీశ్‌రావు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు అవుతారని వ్యాఖ్యానించారు. రాజ్యసభలో బీఆర్ఎసకు ఉన్న నలుగురు ఎంపీలకు బదులుగా కవితకు బెయిల్ వస్తుందని, ఆమెకు రాజ్యసభ ఎంపీ పదవి ఇస్తారని తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో ముఖ్యమంత్రి తన నివాసంలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. మిగతా 2లో..



# మంకీఫాక్స్ అంటువ్యాధి

- మంకీఫాక్స్‌ను గ్లోబల్ ఎమర్జెన్సీగా ఆరోగ్య సంస్థ ప్రకటన
- ఆఫ్రికా దేశంలో 17,500 మంకీఫాక్స్ కేసులు నమోదు
- హైదరాబాద్‌లో అధికారుల అప్రమత్తం

వివరాలు 02లో..

# దేశ వ్యాప్తంగా వైద్యుల నిరసన

- అన్ని రాష్ట్రాల్లో నిరసనలు
- ఆందోళనల్లో పాల్గొన్న వైద్యులు, నర్సులు, మహిళా సంఘాలు
- మమత రాజీనామా చేయాలంటూ బీజేపీ నిరసన
- ప్రభుత్వం, పోలీసుల తీరుపై కలకత్తా హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- ప్రభుత్వ యంత్రాంగం యొక్క సంపూర్ణ వైఫల్యమంటూ వ్యాఖ్యలు

వివరాలు 03లో..

## పీఎస్ఎల్వీ డీ3 ప్రయోగం

# విజయవంతం

- 17 నిమిషాల్లో రోదసిలోకి ఈవోఎస్-08 ఉపగ్రహం
- మరింత కచ్చితంగా విపత్తుల సమాచారం..
- గగన్‌యాన్ ప్రయోగం డిసెంబరులోనే: సోమనాథ్
- ఇస్రోకు మోదీ అభినందనలు

2




## 2 రాష్ట్రాల్లో మోగిన

# ఎన్నికల నగారా

- జమ్ముకశ్మీర్, హరియాణా షెడ్యూల్ విడుదల
- జమ్ముకు సెప్టెంబరు 18నుంచి 3 దశల్లో..
- హరియాణాకు అక్టోబరు 1న.. 4న ఫలితాలు
- మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఢిల్లీకి తర్వాత?

3









# త్వరలో కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం!

- కేసీఆర్‌కు ఏఐసీసీ, కేటీఆర్‌కు పీసీసీ చీఫ్, హరీశ్‌కు మంత్రి, కవితకు రాజ్యసభ ఖాయం
- కవిత బెయిల్‌తో మా పార్టీకి ఏం సంబంధం?
- ఆప్ విలీనంతోనే సిసోడియాకు బెయిల్ వచ్చిందా?
- బాధ్యత లేకుండా కోర్టులపై బురద జల్లడం దుర్మార్గం
- దమ్ముంటే అవినీతి కేసుల్లో కేసీఆర్‌ను జైల్లో పెట్టండి
- రేవంత్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి సంజయ్ ధ్వజం

న్యూఢిల్లీ/హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 16:

"అతి త్వరలోనే కాంగ్రెసలో బీఆర్ఎస్ విలీనం కానుంది. కేసీఆర్‌కు ఏఐసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్‌కు పీసీసీ చీఫ్, హరీశ్‌రావుకు మంత్రి పదవి ఇవ్వనుంది. తెలంగాణ నుంచి కవితను రాజ్యసభకు పంపినా ఆశ్చర్యం లేదు" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం మిగతా 2లో..

నేటి ఫోకస్ న్యూస్

శనివారం 17, ఆగస్ట్ 2024

# బీజేపీలో బీఆర్ఎస్ విలీనం!

(మొదటి పేజీ తరువాయి..)

కాంగ్రెసపై బీఆర్ఎస్, బీజేపీ పలు రకాలుగా విమర్శలు చేశాయని అన్నారు. ఎన్నికల ముందు.. కాంగ్రెస్ పోటీలోనే లేదన్నారని, తాము అధికారంలోకి వచ్చాక.. ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదన్నారని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు రాష్ట్రంలో ప్రతిపక్షం ఉంటుందా? ఉండదా? అనే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. ఇక ఎస్సీ వర్గీకరణపై మోదీ ప్రభుత్వానికి ఎటువంటి విధానం లేదని రేవంత్ ఆరోపించారు. మందకృష్ణ మాదిగకు ప్రధాని మోదీ 'బిగ్ హగ్' ఇవ్వడం తప్ప.. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించ లేదన్నారు. వర్గీకరణకు అనుకూలంగా ఉంటే పార్లమెంటులో బిల్లు పెట్టి కేంద్రం ఆమోదించుకు నేదని తెలిపారు. జాతీయ స్థాయిలో పాలసీ కావాలంటే కేంద్రమే నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం చాన్నాళ్లుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండడంతో తాను సీఎంగా బాధ్యత లు స్వీకరించిన వెంటనే ప్రముఖ న్యాయవాదులతో వాదనలు వినిపించామని చెప్పారు. మంత్రి దామోదర రాజనర్సింహ అధ్వర్యంలో క్యాబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేశామని, ఢిల్లీకి కూడా ప్రతినిధుల బృందాన్ని పంపామని తెలిపారు. వర్గీకరణ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలోనే హామీ ఇచ్చామని, రాహుల్‌గాంధీ కూడా ప్రచారంలో చెప్పారని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పును తమ ప్రభుత్వం అధ్యయనం చేస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణ అనేది పొలిటికల్ రిజర్వేషన్ కాదని, ఉద్యోగాలు, పదోన్నతులకు సంబంధించింది మాత్రమేనని అన్నారు. విదేశీ పర్యటనపై ప్రచారం చేసుకోవాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. "రాష్ట్రంలో ప్రభుత్వం మారినందున.. పాలసీలో మార్పులు ఉంటాయేమోనన్న అనుమానాలుంటాయి. అందుకే మా పాలసీ ఇదీ అని చెప్పుకోవడానికే వెళ్లాం. పెట్టుబడులు పెట్టాలని కంపెనీ, బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ పాలసీ కింద తీసుకుంటే తప్ప పెట్టుబడులు రావు. మనం వెళ్లి ప్రభుత్వ విధానాలు ఏంటో వివరిస్తే వారు చర్చించుకుంటారు కదా! కలిసినోళ్లంతా, పెట్టుబడులు పెడతానన్నోళ్లంతా పెడతారనే గ్యారెంటీ లేదు. ఢిల్లీలో ఉన్నవాళ్లకే హైదరాబాద్‌లో ఏముందో తెలియదు. అమెరికాలో ఉన్న వాళ్లకి ఏం తెలుస్తుంది? ఇంకో రెండేళ్ల తర్వాతనైనా పెట్టుబడులు పెట్టాలనుకుంటే ఆలోచించుకుం టారు కదా!" అని సీఎం రేవంత్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు ఇవ్వకపోవడం మోదీ ఇష్టమని, తాను ప్రయత్నం మాత్రం చేస్తున్నానని చెప్పారు. తనకు అందరితోనూ వ్యక్తిగత సంబంధా లున్నాయన్నారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు తనకు సహచరుడని, ఆయన ఒక మంచి నేత అని పేర్కొన్నారు. తాను రాజకీయంగా స్వయంగా ఎదిగానని రేవంత్‌రెడ్డి తెలిపారు. పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై పార్టీ నిర్ణయం తీసుకోనంత వరకు తమ అభిప్రాయలు చెబుతామని, నియామకం జరిగిన తర్వాత.. ఎవరైనా తమ మనిషేనని స్పష్టం చేశా రు. రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శ లపై సీఎం స్పందిస్తూ.. బీఆర్ఎస్ హయాంలో ఐదేళ్లలో నాలుగు వాయిదాలలో కూడా రుణమాఫీ పూర్తి చేయలేదని విమర్శించారు. రుణమాఫీ కాని రైతుల కోసం కలెక్టరేట్ కార్యాలయాల్లో కౌంటర్లు ఏర్పాటు చేశామని, రైతులు అక్కడి అధికారులను సంప్రదించాలని సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ వాళ్లు రోడ్డెక్కే బదులు గ్రీవెన్స్ సెల్‌లో సంప్రదించా లన్నారు. తమ వద్ద ఉన్న డేటా ప్రకారం రూ.26 వేల కోట్లు రైతు రుణమాఫీకి అవసరమని, కానీ.. అందరినీ దృష్టిలో ఉంచుకుని రూ.31 వేల కోట్లకు బడ్జెట్‌లో అప్రూవల్ ఇచ్చామని తెలిపారు. తనకున్న ప్రాధాన్యం ప్రకారం ఆగస్టు 15 లోపు రైతు రుణమాఫీ చేశానన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రూ.20 వేల కోట్లు కూడా రుణమాఫీ చేయలేదని చెప్పారు. రైతు రుణమాఫీ చెల్లింపుల తో ఇతర పథకాలకు ఎలాంటి కోత ఉండదని సీఎం స్పష్టం చేశారు. "కేసీఆర్ తనకు తోచింది చేసిండు. నచ్చిన కాంట్రాక్టర్లకు పైసలు ఇచ్చుకుం టు పోయిండు. కానీ, మేం అలా చేయడం లేదు. ప్రతి నెలా మొదటిరోజే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల కు కోసం రూ.5 వేల కోట్లకు పైచిలుకు, లోన్ల కోసం రూ.6,500 కోట్లు బ్యాంకులకు చెల్లిస్తు న్నాం. 2014లో ఏడాదికి రూ.6500 కోట్లు చెల్లిస్తే.. ఇప్పుడు నెలకు అంత డబ్బు కట్టాల్సి వస్తోంది" అని సీఎం చెప్పారు. టీజీ న్యాబ్, హైడ్రా సమర్థంగా పనిచేస్తున్నాయని, హైడ్రాపై మొదట్లో కొన్ని విమర్శలు వచ్చాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్‌ను అరికట్టడానికి తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశా రు. ఏం చేసినా ఎవరో ఒకరి నుంచి వ్యతిరేకత వస్తుందని, తాను మాత్రం ఎవరికీ అన్యాయం చేయడంలేదని అన్నారు. వ్యవస్థలు సక్రమంగా పనిచేయాలని మాత్రమే చెబుతున్నానన్నారు. "రాజ కీయ పార్టీలు మీడియా సంస్థలను స్థాపించుకున్న తర్వాత వారి ఇష్టారీతిన నడుపుకోవడానికే తప్ప.. మనం చెప్పడం అనవస రం, మనం చెప్పినదానికి ఉల్టాగా చేయడానికే అవి పనిచేస్తాయి" అని సీఎం వ్యాఖ్యానించారు. వరంగల్‌లో ఏర్పాటు చేసే రైతు రుణమాఫీ సభకు సంబంధించి రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్‌ను ఫోన్లలోనైనా ఓకే చేసుకోవచ్చ న్నారు. రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ సింఘ్వీ పట్ల బీఆర్ఎస్ విమర్శలపై సీఎం స్పందిస్తూ.. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఢిల్లీలో ప్రత్యేక ప్రతిని ధిగా ఉత్తరాది వ్యక్తికి, మీడియా సలహాదారుగా ప్రభుత్వంలో మహారాష్ట్ర వ్యక్తికి పదవులు ఇచ్చిన విషయం మర్చిపోయారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ పంటి, కంటి నొప్పికి ఢిల్లీకి వచ్చేవారని, తెలంగాణలో వైద్యులు లేరా? అని నిలదీశారు. వి.హనుమంతరావు అసలు సిసలైన కాంగ్రెస్ నేత అని రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్, జగన్ ప్రతిపక్ష నేతలను అణగదొక్కి.. ప్రజలిచ్చిన ఉద్యోగాలను కోల్పోయారన్నారు. తమది 150 మంది తోబు ట్టువులతో కూడిన పెద్ద కుటుంబం అని, అందు లో సగం మందికి పైగా బంధువులు అమెరికాలో ఉన్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. తన కుటుంబ సభ్యులకు ప్రభుత్వంలో గానీ, కాంగ్రెస్ పార్టీలో గానీ చిన్న పదవి కూడా ఇవ్వలేదని చెప్పారు. "నా కుటుంబం అసలు తెలంగాణలో పెట్టుబడి పెట్టొ ద్దు అంటారు. ఆయనకు మెంటలా? 2000 సంవ త్సరం తర్వాత కేటీఆర్ అమెరికా వెళ్లారు. కానీ, నా బ్రదర్స్ 1992, 93లోనే అక్కడ ఉన్నారు" అని అన్నారు. తాము ఏడుగురం సొంత అన్నదమ్ముల మని, తాను సీఎంను అయితే.. మిగతా వాళ్లు అన్ని దందాలు బంద్ చేసుకొని కూర్చోవాలా? అని ప్రశ్నించారు. తన సోదరుడి మిత్రుడు గడ్డితో ఇథనాల్ చేయడంలో పేటెంట్ పొందారని, ఆయన హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. హైదరాబాద్‌లో పెట్టు బడులు పెడితే బీఆర్ఎసకు వచ్చే ఇబ్బందేంటని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం ఎవరికీ అప్పనంగా ఆస్తులు ఇవ్వడం లేదని చెప్పారు. రాజకీయాల్లో లేనప్పుడు తాను రూ.70 లక్షల ఖరీదైన ఫోన్ వాడానని, ఇప్పుడు ఆ ఫోన్ ఖరీదు రూ.కోటి ఉంటుందని అన్నారు. కేసీఆర్ సొంత విమానం కొనుక్కోవచ్చు కానీ, తాను ఖరీదైన చెప్పులు కొనుక్కోవద్దా? అని ప్రశ్నించారు.

# ఎస్ఎస్ఎల్వీ-డీ3 విజయవంతం

సూళ్లూరుపేట, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 16:

**ఎస్ఎస్ఎల్వీ -డీ3 ప్రయోగం విజయవంత మైంది. దీంతో ఇస్రో మరో చారిత్రాత్మక మైలురా యికి చేరింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి శుక్రవారం ఉదయం 9.17 గంట లకు ఎస్ఎసఎల్వీ-డీ3 రాకెట్ ప్రయోగం చేపట్టా రు. ఈ రాకెట్ ద్వారా 175.5 కిలోల బరువున్న ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపారు. దీంతో పాటు ఎస్ఆర్-0, డెమోశాట్ మరో రెండు చిన్న ఉపగ్రహాలను కూడా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. శుక్రవారం ఉదయం 9.17 గంటలకు షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదికపై ఉన్న ఎస్ఎసఎల్వీ-డీ 3 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది.**

నాలుగు దశల్లో సునాయాసంగా ప్రయాణిం చిన రాకెట్ తొలుత 16నిమిషాల్లో ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని భూమికి 475కిలోమీటర్ల ఎత్తులో చేర్చింది. అనంతరం నిమిషం వ్యవధిలో మరో 2చిన్న ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి చేర్చింది. ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరిన వెంటనే మిషన్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్న ఇస్రో చైర్మన్ ఎస్. సోమ నాథ్ ఎస్ఎసఎల్వీ-డీ3 ప్రయోగం విజయవం తమైనట్టు ప్రకటించారు. 500 కిలోమీటర్ల ఎత్తు లోని కక్ష్యలోకి తక్కువ బరువున్న ఉపగ్రహాలను ప్రవేశ పెట్టేందుకు ఎస్ఎసఎల్వీ వాహక నౌకను రూపొందించినట్టు తెలిపారు. తాజా ప్రయోగంతో విపత్తులను మరింత కచ్చితంగా తెలుసుకునేందుకు వీలు కలగనుంది. అదేవిధంగా సముద్ర మట్టాలు, అగ్నిపర్వతాల పరిస్థితిని కూడా అంచనావేయొచ్చు. ఈ ఉపగ్రహం ఏడాది పాటు పనిచేయనుంది. మూడేళ్లపాటు తీవ్రంగా శ్రమించిన ఇస్రో శాస్త్రవే త్తలు.. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్(ఎసఎ సఎల్వీ)ను రూపొందించడంలో విజయం సాధిం చారు. దీంతో ఇంధన ఆదాతో పాటు తక్కువ ఖర్చు తో విదేశీ ఉపగ్రహాలను రోదసీలోకి పంపేందుకు శ్రీకారం చుట్టారు. ప్రపంచ దేశాల్లో భారత శాస్త్ర వేత్తల సత్తా ఏమిటో నిరూపించారు. ఇప్పటి వరకు ఇస్రో ప్రయోగించిన 5 రకాల రాకెట్లతో పాటు ప్రస్తుతం సరికొత్త రాకెట్ చేరింది. ఏఎసఎల్వీ, ఎస్ఎల్వీ, పీఎసఎల్వీ, జీఎసఎల్వీ, జీఎసఎల్వీ-మార్క్3 తర్వాత ఎస్ఎసఎల్వీ ఆరో వరుసలో ఆరో రాకెట్‌గా చేరింది. ఎస్ఎసఎల్వీ-డీ3 ప్రయోగం విజయంవంతం కావడం పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. భారత అంతరిక్ష రంగంలో ఇది అతిగొప్ప మైలురాయి అని పేర్కొన్నారు.

**క్రియోస్పియర్ అధ్యయనం..**

భారత రాకెట్ ప్రయోగాల్లో ఇప్పుడు సరికొత్త వాహక నౌక చేరిందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ అన్నారు. ఈవోఎస్-08 భూ పరిశీలన ఉపగ్రహమని, ఇందులో ఉండే ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రా రెడ్(ఈవోఐఆర్) పేలోడ్ మిడ్‌వేవ్, లాంగ్‌వేవ్ ఇన్‌ఫ్రా-రెడ్‌లో చిత్రాలను క్యాప్చర్ చేసి పంపిస్తుందన్నారు. విపత్తు నిర్వహణలో ఈ సమాచారం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈవోఎస్-08 ఉపగ్రహం హిమాలయాల్లోని క్రియోస్పియర్ అధ్యయనం కోసం ప్రధానంగా పని చేస్తుందన్నారు. భవిష్యత్‌లో బుల్లి ఉపగ్రహాలను తక్కువ ఎత్తులోకి ఈ రాకెట్ ద్వారా పంపేందుకు సులువుగా ఉంటుందన్న ఉద్దేశంతో ఎస్ఎసఎల్వీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ఇకపై చిన్న ఉపగ్రహాలు ఎస్ఎసఎల్వీ వాహక నౌక ద్వారానే పంపుతామన్నారు. ఈ ఏడాది డిసెంబరులో గగన్‌యాన్ ప్రయోగం కూడా ఉంటుందన్నారు. దీంతో పాటు పీఎసఎల్వీ, జీఎసఎల్వీ-మార్క్3 ప్రయోగం ఉంటుందని వెల్లడించారు.

## ఇస్రో బృందానికి కేటీఆర్ శుభాకాంక్షలు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 16:

శ్రీహరికోటలోని షార్ నుంచి ఈ వాహన నౌక నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం ద్వారా 175 కిలోల ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. మొత్తం 17 నిమిషాల పాటు ఈ ప్రయోగం సాగింది. విపత్తు నిర్వహణలో సమాచారం ఇచ్చేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. పర్యావరణం, ప్రకృతి విపత్తులు, అగ్ని పర్వతాలపై ఇది పర్యవేక్షించనుంది. ఇస్రోకు చెందిన యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో ఈవోఎస్‌ను అభివృద్ధి చేశారు. ఇందులో ఉండే ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్(ఈవోఐఆర్) పేలోడ్ మిడ్ -వేవ్, లాంగ్ వేవ్ ఇన్‌ఫ్రా-రెడ్‌లో చిత్రాలను క్యాప్చర్ చేస్తుంది. విపత్తు నిర్వహణలో ఈ సమాచారం ఉపయోగపడుతుందని ఇస్రో పేర్కొంది. ఇస్రో చేపట్టిన ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతమైంది. ఈ నేపథ్యంలో ఇస్రో బృందానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు.

# 25, 26న విద్యా సంస్థలకు సెలవులు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 16:

ఆగస్టు 26వ తేదీన(సోమవారం) శ్రీ కృష్ణాష్టమి పండగ. ఈ రోజులు కూడా అన్ని స్కూల్స్ , కాలేజీలు సెలవులు ఉంటుంది. అలాగే ఆగస్టు 25వ తేదీన ఆదివారం. ఈ రోజు సాధారణంగా స్కూల్స్, కాలేజీలకు సెలవులు ఉన్న విషయం తెల్సిందే. దీంతో వరు సగా 2రోజులు పాటు స్కూల్స్, కాలేజీలకు, ఆఫీసులకు సెలవులు రానున్నా యి. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కొందరు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరికొంత మంది మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై బహుజన సంఘాల్లో తీవ్ర వ్యతిరేత వ్యక్తం అవుతోంది. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, రిజర్వేషన్ కేటగిరీలలో ఉపవర్గీ కరణలను అను మతిస్తూ ఈమధ్యే సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చింది. ఈ రెండు వర్గాల్లో ఉపవర్గీకరణ చేపట్టాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల కు నిరసనగా ఆగస్టు 21వ తేదీన (బుధవారం) భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఎస్సీ, ఎస్టీ వర్గకరణకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ కూడా వ్యతిరేకించారు. దీంతో దేశవ్యాప్తంగా ఆందోళనలను మొదలవుతున్నాయి. భీమ్ సేన, ట్రైబల్ ఆర్మీ చీఫ్ బంద్ పిలుపునకు పలు సంఘాలు కూడా మద్దతు ప్రకటించాయి. ఈ తీర్పు ఎస్సీ, ఎస్టీల్లోని ఐక్యతను దెబ్బతీసే విధంగా ఉందని మండిపడు తున్నాయి. దీంతో ఆగస్టు 21వ తేదీ(బుధవారం) దేశంలోని అన్ని పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాలు సెలవు ప్రకటించే అవకాశం ఉంది. దీంతో విద్యార్థులకు ఈ నెలలో అదనంగా మరో రోజు సెలవు జత కానుంది. దాదాపు 2024 ఆగస్టు నెలలో స్కూల్స్, కాలేజీలకు 10 రోజులు వరకు సెలవులు వస్తున్నాయి.

# త్వరలో కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం!

(మొదటి పేజీ తరువాయి..)

కానుందని, ఒప్పందంలో భాగంగానే కవితకు బెయిల్ రానుందని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. "కవితకు బెయిల్ ఇవ్వాలా? వద్దా? అనేది న్యాయస్థానం పరిధిలోని అంశం. కవిత బెయిల్‌కు, బీజేపీకి ఏం సంబంధం? ఆమ్ ఆద్మీ పార్టీని విలీనం చేసుకుంటేనే మనీష్ సిసోడియాకు బెయిల్ వచ్చిందా? ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతూ రాజకీయ లబ్ధి కోసం గౌరవ న్యాయస్థానాలపై బురద చల్లడం దుర్మార్గం" అని వ్యాఖ్యానించారు. బీజేపీని బదనాం చేసేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎసది ముగిసిన అధ్యాయమని, ప్రజలు ఛీత్కరించిన ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ బీజేపీకి లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎసను విలీనం చేసుకోవాలని కాంగ్రెస్సే తహతహలాడుతోందని, పథకం ప్రకారమే ఆ పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకుంటోందని ఆరోపించారు. గతంలోనూ పొత్తు పెట్టుకొని, మంత్రి పదవులు పంచుకున్న చరిత్ర ఆ రెండు పార్టీలకు ఉందని గుర్తు చేశారు. కాళేశ్వరంలో అవినీతి, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్ వంటి కేసుల్లో కేసీఆర్, కేటీఆర్ సహా బీఆర్ఎస్ నేతలను జైలుకు పంపే అవకాశం ఉన్నా, కాంగ్రెస్ కాపాడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ తీరు "నువ్వు కొట్టినట్లు చేయ్... నేను ఏడ్చినట్లు చేస్తా" అన్నట్టుగా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే కాళేశ్వరం సహా అనేక అంశాల్లో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డ కేసీఆర్, కేటీఆర్‌ను జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. కాగా, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని ఆయన సమాధి వద్ద బండి సంజయ్ నివాళులర్పించారు. వాజ్‌పేయి జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

# వాజ్‌పేయికి ప్రధాని మోడీ నివాళులు

- **నివాళులర్పించిన ప్రముఖులు**

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 16:

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిని 2018 ఆగస్ట్ 16న దేశం కోల్పోయింది. అటల్ జీ ఆరవ వర్ధంతి. ఈ సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని సాద్వ్ అటల్ వద్ద మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి నివాళులర్పించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వచ్చారు. ఈ సందర్భంగా భారతరత్న వాజ్‌పేయి చిత్రపటానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు కేంద్ర మంత్రులు, అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ) భాగస్వామ్యానికి చెందిన నేతలు కూడా వాజ్‌పేయికి నివాళు లర్పించారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిని స్మరించుకుంటూ ప్రధాని మోదీ సోషల్ మీడియా హ్యాండిల్‌లో రాశారు.. తన జీవితమంతా దేశసేవకే అంకితం చేశారు. భారతదేశం గురించి అతని కలను నెరవేర్చడానికి మేము నిరంతరం పని చేస్తూనే ఉంటాము. దీనితో పాటు నివాళి కార్యక్రమానికి సంబంధించిన కొన్ని చిత్రాలను కూడా ప్రధాని పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ప్రార్థనా సమావేశం కూడా ఏర్పాటు చేశారు. 2018లో ఈ రోజున ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో దీర్ఘకాల అనారోగ్యంతో మరణించారు. దేశ నిర్మాణంలో ఆయన చేసిన కృషికి లెక్కలేనంత మంది ప్రజలు ఆయనను గుర్తుంచుకుంటారు. ఈ సందర్భంగా హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. దేశంలో రాజకీయ స్వచ్ఛత, దేశ ప్రయోజనాల పట్ల విధేయత, సిద్ధాంతాల పట్ల దృఢత్వం ప్రశ్న వచ్చినప్పుడల్లా వాజ్‌పేయిని తప్పకుండా గుర్తుంచుకుంటారని అన్నారు. ఒకవైపు బీజేపీ స్థాపన ద్వారా వాజ్‌పేయి జాతీయ ప్రయోజనాలను ప్రచారం చేశారని, మరోవైపు ప్రధానిగా దేశాన్ని వ్యూహాత్మకంగా, ఆర్థికంగా బలోపేతం చేశారని అన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. మాజీ ప్రధాని అటల్ జీ వర్ధంతి సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కోట్లాది మంది భాజపా కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని అభివర్ణిస్తూ, 'నైపుణ్యం కలిగిన ఆర్గనైజర్‌గా ఆయన పనిచేశారు. భావజాలం, సూత్రాల ఆధారంగా, అటల్ జీ జీవితం ఎల్లప్పుడూ జాతికి అంకితం చేయబడింది. ఈ రోజు ఆయన స్మారక దినం, అతనికి అనేక నివాళులు.' అంటూ రాసుకొచ్చారు. వాజ్‌పేయికి నివాళులర్పించిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, 'రాజకీయవేత్తగా, డైనమిక్ కవిగా, రచయితగా అటల్ జీ వివిధ రంగాల్లో తన వంతు సహకారం అందించారు.' అని బిర్లా అన్నారు భారతదేశం ఒక భూభాగం కాదని, సజీవ దేశం అని, దేశం, సమాజం కోసం ఆయన చేసిన అంకితభావం మనకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పేవారు. భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు జెపి నడ్డా వాజ్‌పేయిని భారత రాజకీయాలకు 'అజాతశాస్త్రి' అని అభివర్ణించారు. సేవ, సుపరిపాలనకు బలమైన పునాది వేయడంతో పాటు, పోఖ్రాన్ అణు పరీక్ష ద్వారా భారతదేశం అపారమైన సామర్థ్యాన్ని యావత్ ప్రపంచానికి పరిచయం చేశారని తెలిపారు. వాజ్‌పేయికి 2015లో దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న లభించింది. భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుల్లో వాజ్‌పేయి ఒకరు. అతను మూడుసార్లు దేశానికి ప్రధానమంత్రి అయ్యాడు, అతని మొదటి పదవీకాలం 1996లో కేవలం 13 రోజులు మాత్రమే. దీని తర్వాత, అతను 1998లో మళ్లీ ప్రధానమంత్రి అయ్యాడు. 13 నెలల పాటు ఈ పదవిలో ఉన్నారు. 1999 సంవత్సరంలో అతను మూడవసారి దేశానికి ప్రధానమంత్రి అయ్యాడు. ప్రధానమంత్రిగా తన పదవీకాలాన్ని పూర్తి చేసిన మొదటి కాంగ్రెసేతర నాయకుడు వాజ్ పేయ్.

# మంకీఫాక్స్ అంటువ్యాధి

- **మంకీఫాక్స్‌ను గ్లోబల్ ఎమర్జెన్సీగా ఆరోగ్య సంస్థ ప్రకటన**
- **ఆఫ్రికా దేశంలో 17,500 మంకీ ఫాక్స్ కేసులు నమోదు**
- **హైదరాబాద్‌లోనూ అప్రమత్తమైన అధికారులు**

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 16:

కరోనా కంటే మంకీఫాక్స్ డేంజర్,ఇది అంటువ్యాధి అని ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ ఎమర్జెన్సీగా ప్రకటన జారీ చేయడంతో హైదరాబాద్ నగరంలో అలర్ట్ ప్రకటించారు. ఆఫ్రికా దేశ విద్యార్థులు హైదరాబాద్ నగరంలో ఉన్న నేపథ్యంలో అప్రమత్తత ప్రకటించారు.ఆఫ్రికా దేశంలో ఇప్పటికే 17,500 మంకీ ఫాక్స్ కేసులు నమోదయ్యాయి.ఈ మహమ్మారి వల్ల 460 మంది మరణించారు. ఇది అంటువ్యాధి కావడంతో ఆఫ్రికన్ విద్యార్థులు హైదరాబాద్ నగరంలో ఎక్కువగా ఉన్నందున డబ్ల్యూహెచ్ఓ హెచ్చరికతో హైదరాబాద్ వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఆఫ్రికాలో మంకీపాక్స్ వైరస్ కేసులు పెరుగుతుండటంతో ఆఫ్రికన్ యూనియన్ హెల్త్ వాచ్‌డాగ్ ప్రజారోగ్యశాఖ అత్యవసర పరిస్థితిని ప్రకటించింది.ఈ వైరస్ వ్యాప్తి పలు ఆఫ్రికన్ దేశాల్లో, డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో వ్యాపిస్తుంది.మంకీపాక్స్‌ను కాంటినెంటల్ సెక్యూరిటీ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటిస్తున్నామని ఆఫ్రికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ అధిపతి జీన్ కసేయా చెప్పారు.-ఆఫ్రికన్ విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి వచ్చి ఉన్నందున, ఈ అంటు వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.ఉన్నత విద్య అభ్యసించే ఆఫ్రికన్ విద్యార్థులకు హైదరాబాద్ ప్రముఖ గమ్యస్థానంగా ఉంది.డబ్ల్యూహెచ్ఓ హెచ్చరికతో హైదరాబాద్ వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో ఆఫ్రికన్ విద్యార్థులపై వైద్యులు దృష్టి సారించారు. ఆఫ్రికాలో 2022వ సంవత్సరంలో మంకీఫాక్స్ వ్యాధిని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ గుర్తించింది.ఈ వైరస్ మశూచి వంటి లక్షణాలతో కూడిన వైరల్ జూనోటిక్ వ్యాధి అని తేలింది. ఈ వైరస్ మంకీపాక్స్ వైరస్ వల్ల సంభవిస్తుంది.ఈ వ్యాధిని మొదటిసారిగా 1958వసంవత్సరంలో కోతుల్లో కనుగొన్నారు. మొదటి మానవ కేసు 1970వ సంవత్సరంలో డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో వెలుగుచూసింది. 2003వ సంవత్సరంలో ఆఫ్రికా వెలుపల మొట్టమొదటి మంకీపాక్స్ వ్యాప్తి అమెరికాలో వెలుగుచూసింది. మంకీఫాక్స్ వైరస్ గాలి ద్వారా సంక్రమించే కోవిడ్‌లా కాదు.ఈ వైరస్ సోకిన వ్యక్తులతో ప్రత్యక్ష పరిచయం, లైంగిక సంపర్కం లేదా గాయాలతో సన్నిహిత సంబంధం ద్వారా మాత్రమే వ్యాధి సోకుతుంది. మంకీఫాక్స్ లక్షణాలు:మంకీఫాక్స్ వైరస్ లక్షణాలు శోషరస గ్రంథుల వాపు, జ్వరం, తలనొప్పి, శరీర నొప్పులు, తీవ్ర బలహీనతలుంటాయి. జ్వరం వచ్చిన 1-3 రోజులకు చర్మంపై దద్దుర్లు మొదలవుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గురువారం మంకీపాక్స్‌ను అంతర్జాతీయ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించడంతో, ప్రజలు ఈ వైరస్ ప్రమాద కారకాలు,ఎక్స్‌పోజర్‌ను తగ్గించే చర్యల గురించి తెలుసుకోవాల్సి ఉందని డాక్టర్లు చెబుతున్నారు.ఆఫ్రికా దేశం నుంచి హైదరాబాద్ కు విద్యార్థులు వచ్చినందున,మంకీఫాక్స్ వైరల్ ఇన్‌ఫెక్షన్ గురించి సాధారణ ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని హైదరాబాద్ నగరానికి చెందిన ఆశ్రిత ఆసుపత్రి డాక్టర్ రామ్మోహన్ రావు చెప్పారు. హైదరాబాద్ నగరంలో ఆఫ్రికా విద్యార్థుల వల్ల మంకీఫాక్స్ వైరస్ ప్రబలినట్లు ఎలాంటి కేసులు రాలేదని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు 'ఫెడరల్ తెలంగాణ'కు చెప్పారు. ఈ వైరస్ గురించి హైదరాబాద్ లో ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని డాక్టర్ రాజారావు కోరారు. ఆఫ్రికన్ దేశాలకు చెందిన మంకీఫాక్స్ రోగుల ప్రయాణ చరిత్రను తప్పనిసరిగా ట్రాక్ చేయాలి.మంకీపాక్స్ వైరస్ సోకిన వ్యక్తులతో ప్రత్యక్ష పరిచయం ద్వారా వ్యాపిస్తుంది. గత 21 రోజుల్లో ఆఫ్రికా నుంచి హైదరాబాద్ వచ్చిన వారి ప్రయాణ చరిత్రను పరిశీలించాల్సి ఉంది.శరీరంపై తీవ్రమైన దద్దుర్లు ఉంటే,వారు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలి.

# ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన కోదండరాం, అమీర్ అలీఖాన్

(మొదటి పేజీ తరువాయి..)

రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ పదవిని అదనపు బాధ్యతగా మాత్రమే భావిస్తున్నట్లు పేర్కొన్నారు. నేను ఎప్పుడూ ఉద్యమకారులు, అమరవీరుల ఆకాంక్షల మేరకు పనిచేస్తానని ప్రకటించారు. ఈ పదవి చాలామంది బలిదానాలు చేయడంతో వచ్చిందని, వాళ్లను ఎప్పటికీ మరవమని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వీరిద్దరిని గతంలోనే నామినేట్ చేయగా.. ఈ విషయంపై బీఆర్ఎస్ హైకోర్టుకు వెళ్లింది. నియామక గెజిట్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే ఈ విషయంపై ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అయితే గవర్నర్ కోటాలో దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణలను ఎమ్మెల్సీగా నియమించాలంటూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సిఫార్సులను అప్పటి గవర్నర్ రద్దు చేసిన సంగతి తెలిసిందే.

# సీఎం రేవంత్‌తో అభిషేక్ మనుసింఘ్వీ భేటీ

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 16:

ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు కాంగ్రెస్ సీనియర్ నేత, న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి. ఇరువురు మధ్య దాదాపు పావుగంట సేపు మాట్లాడినట్టు తెలుస్తోంది. వివిధ అంశాలపై చర్చించినట్టు తెలుస్తోంది. తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్విని కాంగ్రెస్ హైకమాండ్ ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ నుంచి ఒక సీటు ఉంది.గతంలో బీఆర్ఎస్‌లోవున్న కె కేశవరావు ఆ పార్టీకి రాజీనామా చేసి, కాంగ్రెస్‌కి వచ్చారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో రాజ్యసభ సీటుకు ఉపఎన్నిక అనివార్యమైంది. కేకే ప్లేస్‌లో అభిషేక్ మనుసింఘ్వీకి పెద్దల సభకు పంపించాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించింది. ఆయనకు టికెట్ ఓకే చేసింది కూడా. సుదీర్ఘంగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నారు అభిషేక్ మనుసింఘ్వీ. 2001 నుంచి పార్టీ అధికార ప్రతినిధిగా పని చేస్తున్నారు. రెండుసార్లు పెద్దల సభకు ఎన్నికయ్యారు. అయితే ఈ ఏడాది మొదట్లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్ నుంచి పోటీ చేశారు. బీజేపీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. ఆయన అనుభవాన్ని గుర్తించిన కాంగ్రెస్ పెద్దలు, మనుసింఘ్వీని రాజ్యసభకు పంపాలని నిర్ణయించు కుంది. ఈనెల 21న రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ కొనసాగనుంది. 27న నామినేషన్ ఉప సంహరణ ప్రక్రియకు గడువు ఉంది. సెప్టెంబర్ మూడున పోలింగ్ జరగనుంది.. అదే రోజు ఫలితాలు వెల్లడికానున్నాయి.

# జమ్ము-కశ్మీర్, హర్యానా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు

- సెప్టెంబర్ 18న తొలిదశ.. 25న రెండో దశ ఎన్నికలు, అక్టోబర్1న మూడో దశ ఎన్నికలు
- అక్టోబర్4న ఫలితాలు
- మొత్తం 90 నియోజకవర్గాలకు ఎన్నికలు
- ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ







న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 15:

జమ్ము-కశ్మీర్‌తో పాటు హర్యానా రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి కశ్మీర్‌లో ఎన్నికలు జరుగుతున్నాయి. పలు దశల్లో సమీక్షల అనంతరం కశ్మీర్‌లో ఎన్నికలకు ఏర్పాట్లు చేశామన్నారు. అన్ని పార్టీల అభిప్రాయాలు కూడా తీసుకున్నామని.. ఈసీ రాజీవ్‌కుమార్ తెలిపారు. మొత్తం మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. సెప్టెంబర్18న తొలిదశ, 25న రెండో దశ, అక్టోబర్1న మూడో దశ ఎన్నికలు జరుగుతాయి. ఫలితాలు అక్టోబర్4న వెలువడతాయి. మొత్తం 90 నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అటు హర్యానలోని 90 నియోజకవర్గాలకు ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 1న సింగిల్‌ఫేజ్‌లో పోలింగ్ జరగనుంది. ఫలితాలు 4న వెలువడతాయి. అక్టోబర్6 వరకూ రాష్ట్రంలో కొడ్ కొనసాగుతుంది. కాగా జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత ఇదే తొలి అసెంబ్లీ ఎన్నికలు. ఆగస్టు 9న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ తన బృందంతో జమ్మూ కాశ్మీర్‌లో పర్యటించారు. వీలైనంత త్వరగా ఇక్కడ ఎన్నికలు నిర్వహించేందుకు కమిషన్ కట్టుబడి ఉందని చెప్పారు. 2024 సెప్టెంబర్ 30లోగా జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. వీలైనంత త్వరగా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని, అక్కడ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఎన్నికల సంఘం ప్రకారం.. ఉత్తర కాశ్మీర్‌లోని జిల్లాల్లో చాలా సవాళ్లు ఉన్నాయి. ఇక్కడ చాలా ప్రాంతాలు సున్నితమైనవిగా పరిగణించబడుతున్నాయి. ఉత్తర కాశ్మీర్‌లో అనంత్‌నాగ్, బారాముల్లా, బుద్గాం, బందిపూర్, గందర్‌బల్, కుప్వారా, కుల్గాం, పుల్వామా, షోపియాన్, శ్రీనగర్ జిల్లాలు సున్నిత జిల్లాలుగా పరిగణించబడగా, దక్షిణ కాశ్మీర్‌లో కథువా, సాంబా, రియాసి, జమ్ము, ఉధంపూర్ వంటి జిల్లాలు సున్నిత జిల్లాలుగా పరిగణించబ డ్డాయి.జమ్మూ కాశ్మీర్‌లో ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించవచ్చని వర్గాల సమాచారం. జమ్మూకశ్మీర్ లో చివరిసారిగా 2014లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఏడాది కూడా ఐదు దశల్లో ఎన్నికలు జరిగాయి. బీజేపీ, పీడీపీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పా టు చేశాయి. మెహబూబా ముఫ్తీ రాష్ట్ర ముఖ్య మంత్రి అయ్యారు. అయితే 2018లో సార్వత్రిక ఎన్నికలకు ముందు భాజపా కూటమిని విచ్ఛిన్నం చేయడంతో మెహబూబా ముఫ్తీ ప్రభుత్వం పడిపోయింది. ఆ తర్వాత 2019లో లోక్‌సభ ఎన్నికలు జరిగాయి కానీ అసెంబ్లీకి ఎన్నికలు జరగలేదు. జమ్మూ కాశ్మీర్‌లో డీలిమిటేషన్ తర్వాత, అసెంబ్లీలో మొత్తం సీట్లు 114 సీట్లకు పెరిగాయి. వాటిలో 24 సీట్లు పీవోకే పరిధిలోకి వస్తాయి. మిగిలిన 90 సీట్లలో 43 సీట్లు జమ్మూ డివిజన్‌లో, 47 సీట్లు కాశ్మీర్ డివిజన్‌లో ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 87 స్థానాలకు పోలింగ్ జరిగింది. పీడీపీకి అత్యధికంగా 28 సీట్లు వచ్చాయి. దీంతో పాటు బీజేపీకి 25, నేషనల్ కాన్ఫరెన్స్‌కు 15, కాంగ్రెస్‌కు 12 సీట్లు వచ్చాయి. మూడు స్థానాలు ఇండిపెండెంట్లకు, 4 ఇతరులకు దక్కాయి. హర్యానాలోని 90 స్థానాలకు ఒకే దశలో ఎన్నికలు నిర్వహించవచ్చు. ప్రస్తుతం ఇక్కడ బీజేపీ ప్రభుత్వం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 40 సీట్లు గెలుచుకుంది. మనోహర్ లాల్ ఖట్టర్ సీఎం అయ్యారు. ఎంపీ అయిన తర్వాత నాయబ్ సింగ్ సైనీ ఇక్కడ సీఎంగా ఉన్నారు. మరోవైపు మహారాష్ట్రలో కూడా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడి 288 స్థానాలకు ఎప్పుడు ఓటింగ్ జరగనుందో తర్వాత తెలుస్తుంది. ఇక్కడ బీజేపీ-శివసేన (షిండే వర్గం) ప్రభుత్వం ఉంది. జార?ండ్‌లో 81 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ జేఎంఎం-కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది.




## అమ్మాయిల జోలికెళ్తే కఠిన చర్యలు

- ఎస్సై వెంకట్ రెడ్డి
- ఎవరైనా మైనర్ అమ్మాయిల జోలికెళ్ళినా, ఎక్కడికైనా తీసుకెళ్లినా, వారికీ సహకరించినా జైలుకే జాగ్రత్త

సిర్గాపూర్, (ఫోకస్ న్యూస్ ప్రతినిధి)-అగస్ట్ 16:

సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ ఎస్సై వెంకట్ రెడ్డి శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...ఈ మధ్య యువత చిన్న పెద్ద తేడా లేకుండా మైనర్ అమ్మాయిల జోలికి వెళ్ళడం, వారికీ మాయ మాటలు చెప్పి వెంట పడటం, అమ్మాయిలను తీసుకెళ్లడం చేస్తున్నారు. ఎవరైనా మైనర్ అమ్మాయి జోలికి వెళ్ళినా, ఎక్కడికైనా అమ్మాయిలను తీసుకెళ్లినా, తీసుకెళ్లేందకు ఎవరైనా సహకరించినా ఫోక్సో చట్టం 20 సంవత్సరాలు జైల్లో ఉండాల్సి వస్తుందని అన్నారు. యువత అమ్మాయిల జోలికి వెళ్లి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. అలాగే తల్లి దండ్రులు మైనర్‌పై ఒక కన్నేసి ఉంచాలన్నారు. తమ పిల్లలు ఎమ్ చేస్తున్నారు, ఫోన్స్ విషయంలో గానీ, ఛాటింగ్ విషయంలో గానీ అబ్జర్వ్ చేస్తూ ఉండాలి. లేకుంటే చెడు వ్యసనాలకు బానిసఐ పక్క దారి పట్టి భవిష్యత్తును నాశనం చేసుకుంటారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, యువత కూడా జాగ్రత్త ఉండాలని ఎస్సై వెంకట్ రెడ్డి అన్నారు.

## నారాయణపేట జిల్లాలో అనుమానాస్పద స్థితిలో చిరుత మృతి

నారాయణపేట, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 15:

నారాయణపేట జిల్లా )మద్దూరు మండలం జాదవరావు పల్లి గ్రామ సమీపంలోని తాటి గుట్టపై చిరుత పులి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దూరు మండలంలోని జాదరావుపల్లి తాటి గట్టు గుట్ట సమీపంలోని చెరువులో నీరు తాగ డానికి వచ్చిన సమయంలో ఏదైనా జంతువు దాడి చేసి ఉండవచ్చు అని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనకు సంబంధించి స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు చిరుత మృతిపై విచారణ చేపట్టారు.

## దేశ వ్యాప్తంగా వైద్యుల నిరసన

- అన్ని రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున నిరసనలు
- ఆందోళనల్లో పాల్గొన్న వైద్యులు, నర్సులు, మహిళా సంఘాలు
- మమత రాజీనామా చేయాలంటూ బీజేపీ నిరసన
- ప్రభుత్వం, పోలీసుల తీరుపై కలకత్తా హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- ప్రభుత్వ యంత్రాంగం యొక్క సంపూర్ణ వైఫల్యమంటూ వ్యాఖ్యలు
- హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం

కోల్‌కతా, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 16:

కోల్‌కతా హత్యాచార ఘటన దేశాన్ని కుదిపేస్తోంది. వైద్యురాలి హత్యాచారం తర్వాత నెమ్మదిగా ఆందోళనలు సాగుతున్న తరుణంలో ఒక్కసారిగా అల్లరిమూకలు.. ఆస్పత్రిలోకి ప్రవేశించి ఆధారాలు చెరిపేందుకు ప్రయత్నించడంతో తాజాగా ఈ ఆందోళనలు మరింత ఉధృతం అయ్యాయి. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో వైద్యులు, నర్సులు, మహిళా సంఘాలు, రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. తాజాగా కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రి దగ్గర బీజేపీ శ్రేణులు ఆందోళనకు దిగారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. సీజీఓ కాంప్లెక్స్ వెలుపల ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారుల్ని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులకు-బీజేపీ శ్రేణుల మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది.ఇదిలా ఉంటే కోల్‌కతా ఘటనకు నిరసనగా శనివారం ఉదయం 6 గంటల నుంచి దేశవ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో వైద్య సేవలను నిలిపివేయనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రకటించింది. ఎమర్జెనీ వైద్య సేవలకు మాత్రం మినహాయింపు ఉంటుందని తెలిపింది. అత్యవసర సేవలందించే క్యాజువాలిటీలు పని చేస్తాయని ప్రకటనలో పేర్కొంది. కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటన భారతీయుల్ని తీవ్రంగా కలిచివేస్తోంది. ఆమె హత్యాచారానికి గురైన తీరు గుండెల్ని పిండేస్తోంది. అత్యంత క్రూరంగా ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లుగా పోస్టుమార్టం రిపోర్టు తేటతెల్లం చేస్తోంది. బాధితురాలు తీవ్రంగా ప్రతిఘటించినట్లుగా కూడా అర్థమవుతోంది. ఆమె చాలా ఘోరంగా హింసకు గురైనట్లుగా ఘటనాస్థలిని బట్టి స్పష్టమవుతోంది. ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం విచారణ తాత్సారం చేయడంతో కోల్‌కతా హైకోర్టు జోక్యం పుచ్చుకుని సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. ఇక దర్యాప్తు బృందం.. సంఘటనాస్థలిని పరిశీలించి వెళ్లిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే అల్లరిమూకలు ఆర్‌జీ కర్ ఆస్పత్రిలోకి ప్రవేశించి ఆధారాలు చెరిపేసే ప్రయత్నం చేశారు. కాగా ఈ కేసులో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, ఘటన జరిగిన ఆర్‌జీ కర్ ఆస్పత్రి యాజమాన్యం, పోలీసుల తీరుపై కలకత్తా హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కోల్‌కతా పోలీసుల వైఫల్యంతో ఈ కేసును ఇప్పటికే సీబీఐకి అప్పగించింది హైకోర్టు. ప్రభుత్వ యాజమాన్యంలో మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో ఆగస్టు 9న లేడీ డాక్టర్ దారుణంగా హత్యకు గురైంది. నైట్ డ్యూటీలో ఉన్న ఆమెపై అత్యాచారం చేసి, చంపేశారు. శుక్రవారం తెల్లవారుజామున కాలేజీ సెమినార్ హాలులో ఆమె మృతదేహం నగ్నంగా కనిపించింది. ఈ కేసులో సంజయ్ రాయ్ అనే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే, పోస్టుమార్టం నివేదికలో ఆమె శరీరంలో 150 మిల్లిగ్రాముల వీర్యం దొరకడంతో ఇది సామూహిక అత్యాచారంగా బాధితురాలి తల్లిదండ్రులు హైకోర్టుకి తెలిపారు. ఇదిలా ఉంటే, గురువరాం "రిక్లెయిమ్ ది నైట్" పేరుతో బాధితురాలికి న్యాయం జరగాలని వైద్యులు, మహిళలు పెద్ద ఎత్తున ఆస్పత్రి ముందు నిరసన తెలిపిన సమయంలో, ఓ గుంపు ఆస్పత్రికలోకి ప్రవేశించి విధ్వంసానికి పాల్పడింది. సాక్ష్యాలను నాశనం చేయాలనే ఉద్దేశంలో ఇలా వ్యవహరించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నారు.

తాజాగా ఈ విధ్వంసంపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. "ప్రభుత్వ యంత్రాంగం యొక్క సంపూర్ణ వైఫల్యం" విధ్వంసానికి దారితీసిందని చెప్పింది. రాష్ట్ర పోలీసుల వైద్య సదుపాయాలను, అక్కడ పనిచేస్తున్న వైద్యుల్ని రక్షించలేకపోతే దానిని మూసేయాలంటూ బెంగాల్ ప్రభుత్వంపై విరుచుకుపడింది. ముందస్తు ప్రణాళికతో జరిగిన విధ్వంసంపై మధ్యంతర నివేదిక సమర్పించాలని సీబీఐని హైకోర్టు ఆదేశించింది. విధ్వంసం గురించి రాష్ట్రం తరుపున కోర్టుకు విన్నవిస్తూ.. సుమారు 7000 మంది గుంపు వచ్చిందని, ఆ సంఖ్య అకాస్మత్తుగా పెరిగిందని, తమ దగ్గర వీడియోలు ఉన్నాయని, వారు బారికేడ్లు బద్దలు కొట్టారని, టియర్ గ్యాస్ ప్రయోగించామని, 15 మంది పోలీసులకు గాయాలయ్యాయని చెప్పింది. అయితే, వారి వాదనల్ని విన్న కోర్టు.. పోలీసులకు తెలియకుండా ఈ ఘటన జరిగిందని నమ్మడం చాలా కష్టమని వ్యాఖ్యానించింది. ఇంత అస్థిరమైన అంశంపై ప్రజా నిరసనలకు ఎందుకు అనుమతి ఇచ్చారో చెప్పాలని ప్రధాన న్యాయమూర్తి టీఎస్ శివజ్ఞానం నేతృత్వంలోని ధర్మాసనం డిమాండ్ చేసింది." సాధారణంగా పోలీసులకు ఇంటెలిజెన్స్ వింగ్ ఉంటుంది. హనుమాన్ జయంతి రోజున ఇలాంటివి జరిగాయి. 7,000 మంది గుమిగూడితే, పోలీసులకు తెలియదని నమ్మడం కష్టం." అని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన వాదనల్ని కోర్టు తీవ్రంగా ఖండించింది. మీరు చర్యలు తీసుకుంటున్నారా..? నివారణ చర్యలు ఏమిటి..? అని కోర్టు ప్రశ్నించింది. బాధితురాలి తరుపున వాదించిన సీనియర్ న్యాయవాది బికాష్ రంజన్ భట్టాచార్య, పోలీసులు నిరసనకారుల వెనక దాక్కున్నారు అని వాదించారు. విధ్వంసం నుంచి క్రైమ్ సీన్‌ని కాపాడలేకపోయారని పోలీసులపై ఆరోపించారు. విధ్వంసానికి పాల్పడిన 9 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. సంఘటనలకు సంబంధించి అన్ని విషయాలను సీబీఐకి ఇవ్వాలని కోల్‌కతా పోలీసులను కోర్టు ఆదేశించింది. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్య, అత్యాచారం కేసులో సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. కేసు విచారణలో జాప్యం జరగడంతో విచారణను సీబీఐకి అప్పగించింది.ఈ కేసును దర్యాప్తు చేస్తున్నప్పుడు, సీబీఐ ఆర్ జి కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్‌ను తన పరిధిలోనే ఉంచుకుంది. దర్యాప్తు సంస్థ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌ను కేసు విషయమై విచారించనుంది. కోల్‌కతా పోలీసుల విచారణలో సందీప్ ఘోష్ ప్రస్తావన కూడా వచ్చింది. మహిళా ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనపై యావత్ దేశం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వెల్లువెత్తింది. ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు నిరసనలు జరుగుతున్నాయి. కేసును ఎలాగైనా ఛేదించేందుకు సిబిఐ యాక్షన్ మోడ్‌లో ఉంది. ఈ కేసులో ఇప్పటి వరకు 19 మందిని అరెస్టు చేశారు. ఈ క్రూరత్వం జరిగినప్పుడు సందీప్ ఘోష్ ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. నిరసనల తరువాత అతడు వేరే మెడికల్ కాలేజీకి బదిలీ అయ్యారు. ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌పై గతంలో కూడా అవినీతి ఆరోపణలు వచ్చాయి. కళాశాల మాజీ డిప్యూటీ సూపరింటెండెంట్ అక్తర్ అలీ కూడా సందీప్ ఘోష్‌పై పలు ఆరోపణలు చేశారు. తాను చాలా అవినీతిపరుడని అన్నారు. అతను విద్యార్థులను ఫెయిల్ చేసేవాడు. టెండర్ ఆర్డర్లపై 20శాతం కమీషన్ తీసుకుంటూ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో చేసే ప్రతి పనికి ఆర్జీ ట్యాక్స్ ద్వారా డబ్బులు దోచుకునేవారు.ఈ కేసులో బాధితురాలి కుటుంబ సభ్యుల వాంగ్మూలాలను కేంద్ర దర్యాప్తు సంస్థ నమోదు చేసింది. రెండు సిబిఐ బృందాలు గురువారం ఆర్‌జి కర్ ఆసుపత్రికి చేరుకుని నిరసన తెలుపుతున్న విద్యార్థులను, ఆసుపత్రి ప్రిన్సిపాల్ సుహృతా పాల్‌ను విచారించాయి. ఈ కేసులో ఇప్పటి వరకు 15 మంది వాంగ్మూలాలను నమోదు చేసిన సీబీఐ, ఆ వాంగ్మూలాల ఆధారంగా సందీప్ ఘోష్‌ను సీబీఐ విచారించనుంది. ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను వీలైనంత త్వరగా శిక్షించాలని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈరోజు వీధుల్లోకి రానున్నారు. తృణమూల్ కాంగ్రెస్ నేడు బెంగాల్ వీధుల్లోకి రానుంది. వచ్చే ఆదివారం నాటికి దోషులను ఉరి తీయాలని మమత అన్నారు. ఈ మేరకు ఆయన సీబీఐకి అల్టిమేటం ఇచ్చారు.

## దళిత మహిళకు బషీరాబాద్ ఎస్ఐ బెదిరింపులు

వికారాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 15:

వికారాబాద్ జిల్లా పరిధిలోని బషీరాబాద్‌లో షాద్‌నగర్ తరహా ఉదంతం చోటు చేసుకుంది. విచారణ పేరుతో దళిత మహిళకు బషీరాబాద్ ఎస్ఐ రమేశ్ కుమార్ చిత్రహింసలు పెడుతున్నాడు. కుమారుడి ఆచూకీ చెప్పకపోతే తుపాకీతో కాల్చి చంపేస్తా అంటూ దళిత మహిళను ఎస్ఐ బెదిరింపులకు గురి చేస్తున్నాడు. ప్రేమించిన అమ్మాయితో కొడుకు వెళ్లిపోగా, అతని తల్లి కళావతిని మూడు నెలలుగా ఎస్ఐ రమేశ్ కుమార్ చిత్రహింసలు పెడుతున్నాడు. విచారణ పేరిట పోలీస్ స్టేషన్‌కు పిలిచి కాళ్లు, చేతులు వాచేలా ఎస్ఐ రమేశ్ కుమార్ లాఠీతో కొట్టారని దళిత మహిళ కళావతి ఆరోపించింది. ఈ క్రమంలో ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఆందోళనకు దిగాయి. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవల్గా గ్రామానికి చెందిన లోహడ నరేష్(17), కాశీంపూర్ గ్రామానికి చెందిన బాలిక(16) ప్రేమించుకొని 3నెలల క్రితం ఇంట్లో నుండి వెళ్ళిపోయారు. అయితే బాలికను నరేష్ కిడ్నాప్ చేశాడని బాలిక కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నరేష్ తల్లిని బషీరాబాద్ స్టేషన్‌కు పిలిచి కొడుకు అడ్రస్ చెప్పాలని కాళ్లు, చేతులు వాచిపోయేలా లాఠీ దెబ్బలు కొట్టారు. నరేష్ దొరికే వరకు అతని తల్లి కళావతి రోజు పోలీస్ స్టేషన్‌కు రావాలని చెప్పడం, పోలీస్ స్టేషన్‌కు వచ్చాక ఆమెను కొట్టడం, బయట కూర్చోబెట్టడం చేస్తున్నారు.



## బీఆర్ఎస్ నేత కేటీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

- అధికారం పోయినా అహంకారం తగ్గలేదు
- మహిళలపై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి
- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చందర్

వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:

రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయినా కేటీఆర్ కు అహం తగ్గలేదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చం దర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు రికార్డింగ్ డ్యాన్సులు చేసిన తమకు అభ్యంతరం లేదంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ పట్ట ణ శాఖ ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్ లో ఆయన దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ బిఆర్ఎస్ నేతలకు మహిళల పట్ల గౌరవం లేదని వారి హయాంలో మొదటి దఫాలో మహిళలకు క్యాబినెట్‌లో స్థానం కల్పించలేదని గుర్తు చేశా రు. నాటి ప్రతిపక్ష పార్టీల ఒత్తిళ్లకు లోనై రెండవ దఫా క్యాబినెట్ విస్తరణలో కొందరికి అవకాశం కల్పించారని తెలిపారు. మొన్న జరిగిన అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని బిఆర్ఎస్ కు బొందపెట్టినా సిగ్గు రావడంలేదని విమర్శించారు. ఇకనైనా రాష్ట్ర మహిళలకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలని లేదంటే మహిళల ఆగ్రహానికి గురై రాజకీయ సన్యాసం పుచ్చుకునే రోజులు వచ్చే అవకాశాలు ఉన్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు సత్యం సాగర్ విభూది నారాయణ లక్ష్మీ రవి యాదవ్ సుమిత్ర యాదగిరి జయసుధ మధు గౌడ్ భువనేశ్వరి శ్యామ్ వినోద్ సమన్వయకర్త లక్కాకుల సతీష్ కుమార్ నాయకులు కృష్ణ బాబు వెంకటేష్ మార్కెట్ డైరెక్టర్ లతీఫ్ రాజసింహారెడ్డి చుక్క రాజు బొలెమోని నరసింహ ఆర్ బి రవి సాగర్ ఎండి. ఇర్ఫాన్ ఎండి. సమీర్ ఎండి. అస్లాం ఫజల్ జహంగీర్ ఆరిఫ్ బోయ మురళి తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి

- మున్సిపల్ కమిషనర్‌కు బిజెపి నాయకుల విజ్ఞప్తి

వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:

వనపర్తి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని బిజెపి పట్టణ అధ్యక్షులు బచ్చు రాము అధ్యక్షతన శుక్రవారం మునిసిపల్ కమిషనర్ పూర్ణచందర్ కు విజ్ఞప్తి చేశా రు. 26వ వార్డులో వీధిలైట్లు ఏర్పాటు చేయించాలని గల్లీలలో వీది కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ చిన్నపిల్లల మీదికి ఎగబడి కరుస్తు న్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుళాయిల ద్వారా కాలుషిత నీరు సరఫరా అయ్యి విష జ్వరాలు వస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ స్పందిస్తూ 15 రోజుల్లో కలెక్టర్ అనుమతి పొంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గూడూరు రాము మామిళ్ళపల్లి రాయన్న సాగర్ రాజశేఖర్ గౌడ్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కోదండరాంకు ఎమ్మెల్సీ నియామకం పట్ల హర్షం

- టీజేఎస్ జిల్లా అధ్యక్షులు ఖాదర్ బాషా

వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:

తెలంగాణ ఉద్యమ నాయకులు ప్రొఫెసర్ కోదండరాం కు ఎమ్మెల్సీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం అంబేద్కర్ చౌక్ లో బాణాసంచా పేల్చి సంబరాలు జరిపినట్లు టీజేఎస్ జిల్లా అధ్యక్షులు ఖాదర్ బాషా తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కోసం నిరంతరం కొట్లాడి రాష్ట్రాన్ని సాధించిన ప్రధాన వ్యక్తుల్లో ప్రొఫెసర్ కోదండరాం కీలక వ్యక్తి అని గుర్తు చేశారు. ఎమ్మెల్సీగా నియామక పత్రం అందుకోవడంతో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్, దేవన్న నాయుడు, బలేమియా, రఘు నాయుడు, బాలకృష్ణ, రాజేష్ కుమార్ శెట్టి, ఎండి. షఫీ, నసీర్, షాకీర్ భాష, చాంద్ బాషా, మైనద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ఫోకస్ న్యూస్


# అనిల్ రావిపూడితో వెంకటేశ్ మూవీ

వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్, దిల్‌రాజు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'ఎఫ్2', 'ఎఫ్3' సినిమాల తర్వాత ఈ ముగ్గురి కాంబోలో వస్తున్న చిత్రమిది. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి కథానాయికలు. ఈ సినిమా ఇటీవలే పొల్లాచ్చిలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఈ చిత్ర సెట్లోకి వెంకటేశ్ అడుగు పెట్టారు. ఈ మేరకు చిత్ర బృందం ఓ మేకింగ్ వీడియోని పంచుకుంది. దీన్ని బట్టి ఈ ప్రస్తుత షెడ్యూల్‌లో వెంకీతో పాటు మిగిలిన ప్రధాన తారాగణంపై కుటుంబ నేపథ్య సన్నివేశాలు తెరకెక్కిస్తున్నట్లు అర్థమవుతోంది. ఈ చిత్రంలో వెంకటేశ్ మాజీ పోలీసు అధికారిగా కనిపించనున్నారు. తన అందమైన భార్య.. మాజీ ప్రియురాలు మధ్య జరిగే క్రైమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉండనుంది. ఇది వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాకి భీమ్స్ సిసిరోలియో సంగీత మందిస్తుండగా.. సమీర్ రెడ్డి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.



# మరో సినిమాపై మెగాస్టార్ దృష్టి

కథానాయకుడు చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర'తో సెట్స్‌పై గడుపుతున్న సంగతి తెలిసిందే. వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఈ సోషియో ఫాంటసీ థ్రిల్లర్ ఇప్పటికే ముగింపు దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలోనే దీని తర్వాత చిరు చేయనున్న ప్రాజెక్ట్ ఏదన్నది అందరిలో ఆసక్తి రేకెత్తిస్తోంది. అయితే ప్రస్తుతం సినీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం మోహన్‌రాజా దర్శకత్వంలో చిరు ఓ సినిమా చేసేందుకు పచ్చజెండా ఊపినట్లు తెలుస్తోంది. దీనికి బి.వి.ఎస్ రవి కథ అందిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ స్క్రిప్ట్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయని.. ఈ ఏడాదిలోనే ఈ చిత్రాన్ని పట్టాలెక్కించనున్నారని వార్తలొస్తున్నాయి. నిర్మాతగా చిరు తనయ సుస్మిత కొణిదెల వ్యవహరించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నెల 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌పై స్పష్టత వచ్చే అవకాశముంది.



# తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన రజిషా విజయన్

తనదైన నటనతో తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది రజిషా విజయన్. కోలీవుడ్ స్టార్ కార్తి హీరోగా నటించిన 'సర్దార్' చిత్రంలో ఆమె పోషించిన పాత్రకు మంచి గుర్తింపు వచ్చింది. ప్రస్తుతం తెరకెక్కుతోన్న 'సర్దార్2'లోనూ రజిషా కీలక పాత్ర పోషిస్తోందని మేకర్స్ గురువారం ప్రకటించారు. ఆమెకు వెల్‌కమ్ చెబుతూ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పిఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఎస్ జే సూర్య మరో ప్రముఖ పాత్ర చేస్తున్నాడు. ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ లక్ష్మణ్ కుమార్ నిర్మిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుగుతోందని, భారీ బ్జడెట్‌తో రూపొందిస్తున్నట్టు నిర్మాత తెలియజేశారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నాడు. రెండేళ్ల క్రితం వచ్చిన 'సర్దార్' సక్సెస్ అందుకోవడంతో సీక్వెల్‌పైనా అంచనాలు ఏర్పడ్డాయి.





# సిస్టర్ ఫ్రాన్సెస్కా పాత్రలో టబు



'కథ విన్న వెంటనే... ఎలాంటి సందేహం లేకుండా సిస్టర్ ఫ్రాన్సెస్కా పాత్రలో నటించడానికి అంగీకరించాను' అంటోంది బాలీవుడ్ సీనియర్ నాయిక టబు. ఎంతో మంది అగ్రతారల సరసన నటించి మెప్పించిన ఈ భామ.. త్వరలో 'డ్యూన్:ప్రాఫెసీ' అనే హాలీవుడ్ వెబ్‌సిరీస్‌తో రాబోతుంది. విజయవంత మైన 'డ్యూన్' వెబ్‌సిరీస్‌కి ప్రీక్వెల్‌గా డెనిస్ వి÷-లలెనెయువ్ రూపొందిస్తున్న సిరీస్ ఇది.కథ విన్న వెంటనే... ఎలాంటి సందేహం లేకుండా సిస్టర్ ఫ్రాన్సెస్కా పాత్రలో నటించడానికి అంగీకరించాను అంటోంది బాలీవుడ్ సీనియర్ నాయిక టబు. ఎంతో మంది అగ్రతారల సరసన నటించి మెప్పించిన ఈ భామ.. త్వరలో 'డ్యూన్:ప్రాఫెసీ' అనే హాలీవుడ్ వెబ్‌సిరీస్‌తో రాబోతుంది. విజయవంతమైన 'డ్యూన్' వెబ్‌సిరీస్‌కి ప్రీక్వెల్‌గా డెనిస్ వి÷-లలెనెయువ్ రూపొందిస్తున్న సిరీస్ ఇది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ఇందులోని తన పాత్ర గురించి కొన్ని ఆసక్తికర సంగతులను పంచుకుంది. ఇందులో సిస్టర్ ఫ్రాన్సెస్కా పాత్రను పోషించడం మంచి అనుభవం. ఈ పాత్ర కోసం నన్ను సంప్రదించినప్పుడు ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా అంగీకరించాను. బలమైన, తెలివైన, ఆకర్షణీయమైన పాత్ర ఇది. ఒక నటికి ఇలాంటి పాత్రల్లో నటించినప్పుడు చాలా సంతృప్తిగా ఉంటుంది. మునుపెన్నడూ ఇలాంటి భిన్నమైన పాత్రను పోషించలేదు. ఇది ఈ సిరీస్‌కే ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఇలాంటి ఓ గొప్ప కథతో ప్రేక్షకులను పలకరించడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పుకొచ్చింది. మనిషి మనుగడకు ముప్పు తెచ్చే శక్తులతో హర్కొనెస్ సిస్టర్స్ ఎలా పోరాడారనే కథాంశం ఆధారంగా దీన్ని రూపొందించారు.

